క్లుప్తంగా

రైతు బజారుపై విద్యార్థులకు అవగాహన



మైలవరం: రైతు బజార్లు ఎలా పనిచేస్తాయి, రైతులకు ఏ విధంగా ఉపయోగపడతాయి అనే అంశంపై మైలవరం శ్రీ లీలావతి గిరిజన పాఠశాల విద్యార్థులకు శుక్రవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉడతా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యార్థుల్లో మార్కెట్లపై అవగాహన కల్పించేందుకు, వ్యాపార లావాదేవీలు తెలియజేసేందుకు పాఠశాల ప్రాంగణంలో మోడల్ రైతుబజారు ఏర్పాటు చేశామన్నారు. రైతులు పండించిన పంటను రైతు బజార్లకు తరలించి తద్వారా వినియోగదారులకు ఏ విధంగా అందుబాటులోకి తీసుకువస్తున్నదీ వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రమాదాల నియంత్రణకు చర్యలు

నందిగామరూరల్:జాతీయ రహదారిపై ప్రమాదాల చోటుచేసుకునే ప్రాంతాలను గుర్తించి ప్రమాదాల నియంత్రణకు తగిన చర్యలు తీసుకుంటున్నామని నందిగామ రవాణాశాఖాధికారి పద్మావతి తెలిపారు. ఆర్అండ్బీ, ట్రాఫిక్, జాతీయ రహదారుల అధికారులతో కలిసి శుక్రవారం ఆమె పట్టణంలోని జాతీయ రహదారిపై ప్రమాదాలు చోటుచేసుకునే ప్రాంతాలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ జాతీయ భద్రతా మాసోత్సవాలలో భాగంగా జాతీయ రహదారిని పరిశీలించామన్నారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాలలో ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఎంవీఐ పూర్ణిమ, ఆర్అండ్బీ ఏఈ కిశోర్, ట్రాఫిక్ ఎస్ఐ నరేష్ పాల్గొన్నారు.

ఎల్హెచ్ఆర్ కళాశాల విద్యార్థినులకు కాంస్య పతకం




మైలవరం: కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల ఉమెన్ హ్యాండ్ బాల్ పోటీల్లో మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినులు కాంస్య పతకం సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి తెలిపారు. కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విజయవాడ కేబీఎస్ కళాశాలలో నిర్వహించిన అంతర్ కళాశాలల మహిళా హ్యాండ్ బాల్ పోటీల్లో తమ కళాశాల విద్యార్థినులు కాంస్య పతకం సాధించారన్నారు. ఈ నెల 18,19 తేదీలలో స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యూనివర్సిటీ అంతర్ కళాశాలల పురుషుల హ్యాండ్ బాల్ పోటీలు జరుగుతాయని చెప్పారు. పతకం సాధించిన విద్యార్థినులను ప్రిన్సిపాల్ డాక్టర్ రవి, అధ్యాపకులు, ఫిజికల్ డైరెక్టర్ మన్నే స్వామి అభినందించారు.

రోలర్ స్కేటర్ సోనీ చౌరాసియాకు అభినందన



ఇబ్రహీంపట్నం: గిన్నిస్ బుక్ రికార్డు గ్రహీత, రోలర్ స్కేటర్ సోనీ చౌరాసియా కాశీ నుంచి కాశీకి రోలర్ స్కేటింగ్ చేస్తూ శుక్రవారం ఇబ్రహీంపట్నం చేరుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక రింగ్ సెంటర్లో బీజేపీ, ఆర్ఎస్ఎస్ నాయకులు ఆమెకు ఘనస్వాగతం పలికారు. బీజేపీ స్టేట్ కౌన్సిల్ సభ్యుడు మారాసు కృష్ణ మోహన్, మైలవరం నియోజకవర్గ ఆర్ఎస్ఎస్ ఇన్చార్జి సూరినీడి వెంకట సూరజ్ ఆమెను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. రోలర్ స్కేటింగ్తో కాశీ యాత్ర విజయవంతంగా పూర్తి చేయాలని ఆకాంక్షించారు. జనవరి 20న కాశీలో ప్రారంభమైన రోలర్ స్కేటింగ్ యాత్ర మే నెల ఆఖరున తిరిగి కాశీకి చేరుకుంటుందని సోనీ చౌరాసియా తెలిపారు. కార్యక్రమంలో ఉప్పల వెంకటరమణ కుమార్, కునాల యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



నూజివీడు: డ్రైవర్లు మద్యం, మాదక ద్రవ్యాలు సేవించి వాహనాలను నడపరాదని, నిబంధనలు పాటించని వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని నూజివీడు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ జి. నాగమురళి అన్నారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఆటో డ్రైవర్లు, క్యాబ్ డ్రైవర్లు, వాటి యజమానులు, సహాయకులకు భద్రత వారోత్సవాల్లో భాగంగా నూజివీడులో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ సూర్యపవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పడిపోయిన చికెన్ విక్రయాలు





జి.కొండూరులో వెలవెలబోతున్న చికెన్ దుకాణాలు : మైలవరం మండల పరిధి పుల్లూరు బోర్డర్ చెక్పోస్టు వద్ద కోళ్ల రవాణాను అడ్డుకున్న అధికారులు

- బర్డ్ ఫ్లూ కలకలంతో చికెన్ కొనుగోలుకు వెనుకాడుతున్న ప్రజలు
- వెలవెలబోతున్న చికెన్ దుకాణాలు
- మటన్, ఫిష్కు పెరిగిన డిమాండ్

జి.కొండూరు: బర్డ్ ఫ్లూ కలకలం చికెన్ విక్రయాలపై ప్రభావం చూపుతోంది. నిన్న మొన్నటి వరకు గోదావరి జిల్లాలను వణికించిన బర్డ్ ఫ్లూ ఎన్టీఆర్ జిల్లాను తాకింది. బర్డ్ ఫ్లూ లక్షణాలతో వేల సంఖ్యలో బ్రాయిలర్ కోళ్లు మృత్యువాత పడడంతో చికెన్ కొనుగోలు చేసేందుకు ప్రజలు వెనుకాడుతున్నారు. బర్డ్ ఫ్లూ అని నిర్ధారణ కాకపోయినప్పటికీ ఒకే కోళ్ల ఫారంలో వేల సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడడం ఆందోళనకు దారి తీసింది. అధికారులు సైతం చికెన్, గుడ్లు తినడం కొంతకాలం ఆపేయాలంటూ సూచన చేస్తున్న క్రమంలో పౌల్ట్రీ పరిశ్రమ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది.

మటన్, ఫిష్కు డిమాండ్

బర్డ్ ఫ్లూ ప్రభావంతో చికెన్ కొనుగోలు చేసేందుకు ప్రజలు వెనుకాడుతున్నప్పటికీ కోళ్ల రవాణా నిలిచిపోవడంతో ఉన్న కోళ్లను అవే ధరలకు విక్రయిస్తున్నారు. చికెన్ చిన్న బ్రాయిలర్, పెద్ద బ్రాయిలర్ కిలో రూ.220 నుంచి 240 వరకు విక్రయిస్తున్నారు. రెస్టారెంట్లు, హోటళ్లలో సైతం చికెన్ ఆర్డర్లు చేసేందుకు భోజన ప్రియులు వెనుకాడుతున్నారు. దీనితో కొంచెం ధర ఎక్కువైనా మటన్, ఫిష్, ప్రాన్స్తో కూడిన ఆహార పదార్థాలనే ఆర్డరు చేస్తున్నారు. దీనితో మటన్, ఫిష్, ప్రాన్స్ విక్రయాలు జోరందుకున్నాయి. వైన్ షాపుల వద్ద స్నాక్స్ పాయింట్లు, పలు హోటళ్లలో ఇంకా చికెన్ వంటకాలను తయారు చేస్తున్న క్రమంలో చికెన్ విక్రయాలు సగానికి సగం పడిపోయినప్పటికీ విక్రయాలు కొనసాగుతూనే ఉన్నాయి.

సగానికి పైగా పడిపోయిన విక్రయాలు

తిరువూరు నియోజకవర్గ పరిధిలో 71 గ్రామ పంచాయతీలలో 130 వరకు చికెన్ దుకాణాలు ఉండగా మైలవరం నియోజకవర్గంలోని 62 గ్రామ పంచాయతీల పరిధిలో 150 వరకు చికెన్ దుకాణాలు ఉన్నాయి. ఈ రెండు నియోజకవర్గాలలోని దుకాణాలలో రోజుకి 15 టన్నుల నుంచి 20 టన్నుల వరకు మాసం విక్రయాలు జరుగుతుండేవి. అయితే గత మూడు రోజులుగా కోళ్లు మృత్యువాత వార్త జోరుగా ప్రచారం జరగడంతో విక్రయాలు సగానికి పైగా పడిపోయినట్లు దుకాణ యజమానులు చెబుతున్నారు.

రెడ్ జోన్లో కోళ్ల రవాణా నిలిపివేత

గంపలగూడెం మండల పరిధి అనుమల్లంక గ్రామంలో ఒకే కోళ్ల ఫారంలో 14 వేలకు పైగా బ్రాయిలర్ కోళ్లు మృత్యువాత పడడంతో రెండు రోజులపాటు ఇతర రాష్ట్రాల నుంచి ఎన్టీఆర్ జిల్లాలోకి కోళ్ల రవాణాను పూర్తిగా నిలిపివేశారు. ఎన్టీఆర్ జిల్లా పరిధిలోని 12 స్టేట్ బోర్డర్ చెక్పోస్టుల వద్ద 36 మంది పశు వైద్య శాఖాధికారులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి కోళ్లు రవాణా చేస్తున్న ఏ ఒక్క వాహనాన్ని కూడా అనుమతించలేదు. కోళ్లు ముత్యువాత పడిన ఫారంలో కోళ్ల నమూనాలను సేకరించి భోపాల్ ల్యాబ్కు పంపారు. రిపోర్టులు రావడానికి ఆలస్యమవుతుండటంతో గంపలగూడెం మండలంలో కోళ్లు మృత్యువాత పడిన ప్రదేశం నుంచి పది కిలోమీటర్ల పరిధి వరకు రెడ్జోన్గా ప్రకటించి ఆ ప్రాంతం మినహా జిల్లాలోని మిగిలిన ప్రాంతాలకు ఆరోగ్యవంతమైన కోళ్ల రవాణాకు అధికారులు అనుమతిస్తున్నారు.

కొనసాగుతున్న గుడ్ల రవాణా

గోదావరి జిల్లాల్లో బర్డ్ ఫ్లూ అని నిర్ధారణ అయినప్పటికీ, ఎన్టీఆర్ జిల్లాలో 14 వేలకు పైగా బ్రాయిలర్ కోళ్లు మృత్యువాత పడినప్పటికీ చికెన్, కోడి గుడ్ల విక్రయాల నిలిపివేతపై ఎటువంటి ఆంక్షలు విధించలేదు. దీనితో జిల్లాలో చికెన్ విక్రయాలు తగ్గినప్పటికీ కోడి గుడ్ల విక్రయాలు జరుగుతూనే ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు కోడిగుడ్ల సరఫరా చేస్తున్నారు.

నాణ్యమైన పెట్రోల్ అందించాలి

సబ్ కలెక్టర్ కావూరి చైతన్య



ఇబ్రహీంపట్నం: పెట్రోల్ బంకుల్లో వాహనదారులకు నాణ్యమైన పెట్రోల్, డీజిల్ అందించాలని సబ్ కలెక్టర్ కావూరి చైతన్య పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నంలో నూతనంగా నిర్మించిన పెట్రోల్ బంక్ను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెట్రోల్ నాణ్యత, తూకం పరిశీలించారు. బంకుల్లో వినియోగదారులకు ఉచితంగా లభించే సేవలు గాలిపంపు, తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయాలపై ఆరా తీశారు. అనంతరం కొండపల్లి పారిశ్రామిక వాడలో కెమికల్ కంపెనీలను తనిఖీ చేశారు. కెమికల్ కంపెనీలో రసాయన ఉత్పత్తుల ద్వారా ప్రమాదకరంగా వచ్చే జల, వాయు కాలుష్య వ్యర్థాల తరలింపుపై ఆరా తీశారు. జల వ్యర్థాలు తప్పనిసరిగా శుద్ధి చేయాలని ఆదేశించారు. కంపెనీల ఉత్పత్తులు పరిశీలించారు. కెమికల్ కంపెనీల్లో చేపడుతున్న భద్రతా ప్రమాణాలపై ఆరా తీశారు. భద్రతా ప్రమాణాలు పటిష్టంగా అమలు చేయాలని ఆదేశించారు. తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నిరుపయోగంగా మీ సేవా కేంద్ర భవనం

శిథిలమవుతున్న ఫర్నిచర్

నూజివీడు: పట్టణంలోని గాంధీ పార్కు వద్ద ఉన్న మీ సేవా కేంద్ర భవనం నిరుపయోగంగా మారింది. గతంలో ప్రభుత్వ ఆధ్వర్యంలోని మీ సేవా కేంద్రాన్ని ఈ భవనంలోనే నడిపేవారు. మీ సేవా కేంద్రాలను ప్రభుత్వం రద్దు చేయడంతో ఈ భవనం అప్పటి నుంచి నిరుపయోగంగా ఉండి శిథిలావస్థకు చేరుతోంది. పట్టణ నడిబొడ్డున ఉన్న ఈ భవనాన్ని వార్డు సచివాలయాలకు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు ఉపయోగించుకోవచ్చు. మున్సిపల్ అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు గాలికి వదిలేయడంతో అందులో ఉన్న వేలాది రూపాయల విలువ చేసే ఫర్నిచర్ సైతం చెదలు పట్టిపోతోంది. వార్డు సచివాలయాలను ప్రైవేటు బిల్డింగ్లో ఏర్పాటు చేసి నెల నెలా రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకు అద్దె చెల్లిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ బిల్డింగ్లో వార్డు సచివాలయాన్ని ఏర్పాటు చేస్తే మున్సిపాలిటీకీ ప్రజాధనం ఆదా అవడంతో పాటు భవనం కూడా వినియోగంలోకి వస్తుంది. ఆ దిశగా మున్సిపల్ అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



నూజివీడులో నిరుపయోగంగా ఉన్న మీ సేవా కేంద్ర భవనం



భవనం లోపల చెదలు పట్టి పాడైపోతున్న ఫర్నిచర్

దామోదర సంజీవయ్యకు నివాళి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మాజీ ముఖ్యమంత్రి దామోదర సంజీవయ్య జయంతి కార్యక్రమం కొండపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ఆయన చిత్రపటానికి డీసీసీ అధ్యక్షుడు బొర్రా కిరణ్ పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఆయన సేవలను పలువురు కొనియాడారు. పీసీసీ కార్యదర్శి పోతురాజు ఏసుదాసు, డీసీసీ కార్యదర్శి చింతపల్లి దాస్ తదితరులు పాల్గొన్నారు

నేటి నుంచి ఆలయ వార్షికోత్సవం

నరసాపురం(విస్సన్నపేట): మండలంలోని నరసాపురంలోని శ్రీ సూర్యలక్ష్మీనారాయణ దేవాలయ ప్రథమ వార్షికోత్సవం శనివారం ప్రారంభమవుతుందని ఆలయ నిర్వాహకులు సుబ్రహ్మణ్యేశ్వర రావు తెలిపారు. సూర్య లక్ష్మీనారాయణస్వామి, దశావతారాలు, అష్టలక్ష్మీ సహిత గ్రామ నాభిశిల, శీతల పరమేశ్వరీ, ముత్యాలమ్మ దేవతల విగ్రహాలను ప్రతిష్ఠించి ఏడాది పూర్తయిన సందర్భంగా 17న కల్యాణ మహోత్సవం, అన్నప్రసాద వితరణ జరుగుతుందని చెప్పారు.

21 నుంచి ఆగిరిపల్లిలో సబ్ జోన్ ఆటల పోటీలు

నూజివీడు: సబ్ జోన్ ఆటల పోటీలు ఈనెల 21, 22 తేదీల్లో నిర్వహించేందుకు నియోజకవర్గంలోని పీడీలు, పీఈటీలు సమన్వయంతో పనిచేయాలని డీవైఈఓ ఎం.సేవియా అన్నారు. స్థానిక డీవైఈఓ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గంలోని పీడీలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సబ్ జోన్ ఆటల పోటీల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా పటిష్టమైన ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. ఆరు నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులకు ఒకే కేటగిరిలో ఆటలు, క్రీడలు నిర్వహించాలన్నారు. ప్రతి స్కూల్ నుంచి క్రీడల విభాగంలో ఈవెంట్కు ఇద్దరు విద్యార్థులు పాల్గొనవచ్చని చెప్పారు. వాలీబాల్, త్రోబాల్, కబడ్డీ, ఖోఖో, 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్ల పరుగు పందెం, షాట్పుట్, డిస్కస్ త్రో, బ్రాడ్ జంప్ విభాగాల్లో ఈ పోటీలు జరుగుతాయన్నారు. సమావేశంలో సబ్ జోన్ సెక్రటరీ సుగుణరావు, నియోజకవర్గ ఇన్చార్జి పీడీ పి. రవీంద్ర, పీడీలు వాకా నాగరాజు, శివనాగేంద్రం, లక్ష్మి, అన్నామణి, వాకా వనజ, సతీష్, ఆలీఖాన్, సుకుమార్, నాగేశ్వరరావు, హర్ష, రాణి, ఉమామహేశ్వరి, స్వప్న, నాగమణి పాల్గొన్నారు.

బ్రిటిష్ పాలకులే నయమనిపిస్తోంది

మైలవరం ఠాణా ఎదుట దళితుల ధర్నా

మైలవరం: దళితుడైన సంసోనుపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలని ఎమ్మార్పీఎస్ నేతలు డిమాండ్ చేశారు. 76 వసంతాలు గడచినా దళితులకు స్వాతంత్ర్య ఫలాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాటి బ్రిటిష్ పాలకులే నయమనిపిస్తోందన్నారు. మైలవరం మండలం ములకలపెంట గ్రామంలో ఈ నెల 8వ తేదీన జరిగిన హత్య కేసులో అనుమానితులుగా ఉన్న చల్లా సుబ్బారావు, సగ్గుర్తి సంసోనులను పోలీసులు మైలవరం సీఐ కార్యాలయానికి తీసుకువచ్చారు.

సుబ్బారావుపై చేయి వేయని పోలీసులు దళితుడైన సంసోనుపై మాత్రం థర్డ్ డిగ్రీ ప్రయోగించి, చిత్రహింసలకు గురిచేసినట్లు ఎమ్మార్పీఎస్ నాయకులు ఆరోపించారు. న్యాయం కోరుతూ సీఐ కార్యాలయం వద్ద శుక్రవారం రాత్రి పొద్దుపోయే వరకు ఆందోళన చేపట్టారు. సీఐకు వినతి పత్రం అందజేసే వరకు పోలీస్ స్టేషన్ ముందు నుంచి కదిలే ప్రసక్తి లేదని గ్రామస్తులు భీష్మించారు. మైలవరం ఎస్ఐ సుధాకర్ వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వారు పట్టించుకోలేదు. ఎమ్మార్పీఎస్ ఉమ్మడి కృష్ణా జిల్లా నాయకుడు మందా వెంకటేశ్వరరావు మాదిగ తదితరులు పాల్గొన్నారు.



ఆందోళనకారులతో మాట్లాడుతున్న ఎస్ఐ సుధాకర్

అడ్డగోలుగా మట్టి తవ్వకాలు





చెవుటూరు మృత్యువాని చెరువులో చెట్ల వేర్లతో సహా తవ్వకాలు జరిపిన ప్రదేశం : మృత్యువాని చెరువులో వేర్లతో సహా తవ్వి పడేసిన తుమ్మ చెట్టు

- చెరువులో చెట్లను తొలగించి పొక్లెయిన్లతో తవ్వకాలు
- వాగుల్లో చెట్లను సైతం నరికి కలప తరలింపు
- అక్రమార్కులపై చర్యలు శూన్యం

జి.కొండూరు: సహజ వనరులు దోపిడీయే ప్రధాన ఆదాయ వనరుగా ఎంచుకున్న అక్రమార్కులు రాత్రి సమయాల్లో చెరువులలో మట్టిని తరలిస్తున్నారు. తవ్వకాలకు అడ్డొచ్చిన వృక్ష సంపదను అడ్డగోలుగా నరికివేస్తున్నారు. మట్టి తవ్వకాల దందాను నడిపేది ఒకరైతే ధ్వంసం చేసిన చెట్ల కలపను తరలిస్తూ సొమ్ము చేసుకునేది మరొకరు. బహిరంగంగా జరుగుతున్న ఈ అక్రమ దందాను అడ్డుకోవాల్సిన అటవీ, ఇరిగేషన్ అధికారులు చోద్యం చూస్తుండడంతో విలువైన మట్టి, చెట్ల రవాణా గత కొన్నేళ్ల నుంచి కొనసాగుతూనే ఉంది.

చెరువులో చెట్లు ధ్వంసం..

జి.కొండూరు మండల పరిధి చెవుటూరు గ్రామ శివారులోని మృత్యువాని చెరువులో అక్రమార్కులు మట్టిని తరలించేందుకు చెరువులో ఉన్న తుమ్మ చెట్లను తొలగిస్తున్నారు. ఈ చెరువు 51.60 ఎకరాల విస్తీర్ణంలో వ్యాపించి ఉండగా 47.99 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ చెరువులో వేయికి పైగా తుమ్మ చెట్లు ఉన్నాయి. అక్రమార్కులు రాత్రి సమయాల్లో ఈ చెరువును మట్టిని తవ్వకాలకు అడ్డాగా మార్చుకున్నారు. ఇష్టారాజ్యంగా చెట్ల మధ్య ఉన్న మట్టిని తరలిస్తూ అడ్డొచ్చిన చెట్లను పొక్లెయిన్లతో వేర్లతో సహా తొలగించి వేస్తున్నారు. ఆ తర్వాత కలప దొంగలు ఆ చెట్లను నరికి ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. నిత్యం ఈ అక్రమ రవాణా జరుగుతున్నప్పటికీ అధికారులెవరూ అటువైపు కన్నెత్తి కూడా చూడడంలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రాత్రి సమయాల్లోనే..

చెవుటూరు మృత్యువాని చెరువులో మట్టి తవ్వకాలకు అక్రమార్కులు అర్ధరాత్రి సమయాన్ని అనుకూలంగా ఎంచుకున్నారు. ఆ సమయంలో అయితే అధికారులెవరూ అటువైపు వచ్చే అవకాశం ఉండదని భావించి తవ్వకాలు జరుపుతున్నారు. పొక్లెయిన్లతో తవ్వి ట్రాక్టర్ల ద్వారా మట్టి అక్రమంగా తరలిస్తున్నారు.

యథేచ్ఛగా చెట్ల నరికివేత

- చెవుటూరు గ్రామ శివారులోని కొడిశల వాగులో ఉన్న 30 వేప చెట్లను అక్రమార్కులు నరికి కలపను ఏలూరు జిల్లాలోని ఓ ఎమ్మెల్యే తమ్ముడి టింబర్ డిపోకి తరలించారు. దీనిపై అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు.
- రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమ భూమి ధరను పెంచుకునేందుకు దారి ఏర్పాటులో భాగంగా జి.కొండూరు మండల పరిధి గడ్డమణుగు గ్రామాన్ని ఆనుకొని ఉన్న దొర్లింతాల వాగు కట్టపై ఉన్న మర్రి, తాటి చెట్లను నరికేశారు.
- వెల్లటూరు గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో అటవీశాఖ సంరక్షణలో 25ఎకరాల్లో పెంచుతున్న జామాయిల్ చెట్లను కొన్నింటిని పలువురు కలప దొంగలు నరికి కలప తరలించారు. దీనిపై అటవీ శాఖాధికారి (డీఆర్ఓ) పి. రాజుని వివరణ కోరగా గతంలో జామాయిల్ చెట్లను నరికిన వ్యక్తులకు జరిమానా విధించామని చెప్పారు.
- 20వేల హెక్టార్లకు పైగా విస్తీర్ణంలో వ్యాపించి ఉన్న కొండపల్లి అటవీ ప్రాంతం నుంచి కలప దొంగలు చెట్లను నరికివేసి నిత్యం కలప అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది.

ప్రత్యేక కార్యాచరణతో అభివృద్ధి ప్రణాళికలు

కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ

పెనుగంచిప్రోలు: ఆకాంక్షిత బ్లాక్ కార్యక్రమం(ఏబీపీ)కింద పెనుగంచిప్రోలు, ఇబ్రహీంపట్నం మండలాల్లో ప్రత్యేక కార్యాచరణతో అభివృద్ధి ప్రణాళికలు అమలు చేయడం ద్వారా మంచి ఫలితాలు వస్తున్నాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ పేర్కొన్నారు. పెనుగంచిప్రోలులో శుక్రవారం ఆయన పర్యటించారు. క్షేత్రస్థాయిలో వివిధ సూచికల్లో అమలు చేస్తున్న కార్యక్రమాలను పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు అందిస్తున్న పోషకాహారాన్ని పరిశీలించారు. చిన్నారులతో ముచ్చటించి వారి చేత నంబర్లు, రైమ్స్ చెప్పించారు. చిన్నారుల శారీరక, మానసిక ఆరోగ్య వికాసానికి అందుబాటులో ఉన్న వసతులు, అవసరమైన సౌకర్యాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వైద్య ఆరోగ్య రంగంలో సూచికల్లో ప్రగతికి సంబంధించి ఆరోగ్య కార్యకర్తలు చేపట్టిన ఎన్సీడీ సర్వే తీరును పరిశీలించారు. ప్రభుత్వం చేపట్టిన ఈ సర్వేకు ప్రజలు సహకరించాలని కలెక్టర్ కోరారు. ముందస్తు ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటే మంచి ఫలితాలు ఉంటాయని సూచించారు.

ప్రత్యేక అవసరాలున్న పిల్లలపై దృష్టి...

ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు మంచి భవిష్యత్ అందించాలనే లక్ష్యంతో ఆకాంక్షిత బ్లాక్ల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఇందులోభాగంగా మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులకు కేవీఆర్ జెడ్పీ హైస్కూల్లో రెండు రోజులపాటు సహిత విద్యా శిక్షణ కార్యక్రమం నిర్వహించామన్నారు. ప్రత్యేక అవసరాలున్న పిల్లలను గుర్తించడం, బ్రెయిలీ లిపి, విద్యాహక్కు చట్టం-11 సూచికలు తదితర అంశాలపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చినట్లు వివరించారు. శిక్షణ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు అందజేశారు.

అనంతరం కలెక్టర్ స్థానిక హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. ఉపాధ్యాయుల బోధనాతీరుపై ఆరా తీశారు. ఇంగ్లిష్లో అనర్గళంగా మాట్లాడిన విద్యార్థినులు శ్రీజ, ఇందులను అభినందించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష అడిషినల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి. మహేశ్వర రావు, డ్వామా పీడీ ఎ.రాము, ఏబీపీ బ్లాక్ కోఆర్డినేటర్లు మోహన్ సందీప్, పి.శ్రీనివాస్, తహసీల్దార్ ఎ. శాంతిలక్ష్మి, ఎంపీడీఓ జి.శ్రీను, ఎంఈఓ డి.రవీంద్ర, వైద్యాధికారి సృజన, ఐసీడీఎస్ సూపర్వైజర్ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.



టెన్త్ విద్యార్థులతో ముచ్చటిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

ప్రజా సంఘాల ప్రచారం

నూజివీడు: ఎమ్మెల్సీ ఎన్నికల్లో కేఎస్ లక్ష్మణరావును గెలిపించాలని కోరుతూ నూజివీడు మండలంలో ప్రజా సంఘాల నాయకులు శుక్రవారం ప్రచారం నిర్వహించారు. సీఐటీయూ, రైతు సంఘం నాయకులు జి. రాజు, పి. బోసు, ఆర్. ప్రసాద్, కె. శామ్యూల్ తదితరులు మండలంలోని తుక్కులూరు, మొర్సపూడి, గొల్లపల్లి, మీర్జాపురం, సీతారామపురంలోని ఉపాధ్యాయులను, పట్టభద్రులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. సమస్యలు పరిష్కారమవ్వాలంటే కేఎస్ లక్ష్మణరావు గెలవాల్సి ఉందన్నారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

19 నుంచి ప్రతిష్ఠ మహోత్సవాలు

ముష్టికుంట్ల(తిరువూరురూరల్): మండలంలోని ముష్టికుంట్లలో పునర్నిర్మించిన విజయ దాసాంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఈ నెల 19 నుంచి ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ తెలిపింది. 21న ధ్వజస్తంభ, విమాన శిఖర, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేస్తామని చెప్పారు.

పేకాట శిబిరంపై దాడి

చాట్రాయి: మండలంలోని సూరంపాలెం శివారులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో శుక్రవారం దాడి చేశామని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. 8 మందిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. రూ.73,430 నగదు, ఆరు ద్విచక్ర వాహనాలు, 9 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలి

చందర్లపాడు(నందిగామరూరల్):విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్వైజర్లు వెంకట్రావమ్మ సూచించారు. మండలంలోని ముప్పాళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోషణ అభిపడాయిబీ కార్యక్రమంపై శుక్రవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే ఆరోగ్యంగా ఉంటామన్నారు. ముఖ్యంగా ఆరోగ్యం, బరువు తక్కువ ఉన్నవారిని గుర్తించి ప్రత్యేక శ్రద్ధ చూపాలని అంగన్వాడీ కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో షేక్ ఇష్రాత్, శ్రీదేవి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

అంకమ్మ అమ్మవారికి పూజలు



పెనుగంచిప్రోలు: శ్రీ తిరుపతమ్మ అమ్మ వారి పెద్ద తిరునాళ్లలో భాగంగా నాలుగో రోజు శుక్రవారం గ్రామస్తులు అమ్మవారికి బోనాలతోపాటు అంకమ్మ క్రతువులు ఘనంగా నిర్వహించారు. ఆచారం ప్రకారం బైండ్లవారు పూల కప్పెర పట్టుకొని గ్రామంలో అమ్మవారి చరిత్రను ఒగ్గుకథ రూపంలో చెప్పారు. అర్ధరాత్రి తరువాత అంకమ్మ వారి ఆలయంలో దీవెనబండారు కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆలయ అధికారులు తెలిపారు. అంకమ్మ అమ్మవారి ఆలయంలో ఏర్పాటు చేసిన జలబిందెల్లోని నీటిని నవధాన్యాలపై చల్లారు. శనివారం జరిగే పూర్ణాహుతి కార్యక్రమంతో పెద్ద తిరునాళ్ల ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ ఈఓ కిశోర్కుమార్ తెలిపారు.